ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-11-2026 సమయం: సాయంకాలం 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశీ, పారిశ్రామిక ప్రతినిధులతో సమావేశం కానున్నారు.

- ఏపీపీఎస్సీ 720 పోస్టులతో కూడిన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.

- తిరుపతి వేదికగా వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న అఖిల భారత డీజీపీ-ఐజీపీ సదస్సులో యోగా కార్యక్రమాలను భాగం చేయనున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

- హామిల్టన్ వేదికగా న్యూజిలాండ్ - భారత్ జట్ల మధ్య జరగాల్సిన మూడో వన్డే క్రికెట్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

==========

భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ 31వ భాగస్వామ్య సదస్సు విశాఖపట్నం వేదికగా నెల 12, 13వ తేదీల్లో జరగనుంది. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, మంత్రులు, దౌత్యవేత్తలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, బహుళజాతి సంస్థల అధినేతలు హాజరుకానున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని.. వివిధ దేశాల ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామిక సంస్థల అధినేతలతో సమావేశం కానున్నారు. నవంబర్ 12వ తేదీ ఉదయం 10 గంటల 30 నిమిషాలకు విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ సదస్సు ప్రారంభం కానుంది. సదస్సు ప్రారంభ కార్యక్రమాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు. ఆ తర్వాత జరగనున్న వివిధ సెషన్లు, సమావేశాల్లో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు భాగస్వాములు కానున్నారు. అలాగే కీలక సమావేశాల్లో ముఖ్యమంత్రి పాల్గొని... ఆయా అంశాలపై చర్చించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను వివరించనున్నారు. సీఐఐ సదస్సుని పురస్కరించుకొని ముఖ్యమంత్రి పలు దేశాల మంత్రులు, రాయబారులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతోనూ సమావేశమవుతారు. సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, గ్వాటెమాలా, స్లోవేకియా దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులతో భేటీ కానున్నారు.

==========

ఏపీపీఎస్సీ గ్రూప్-2 నోటిఫికేషన్ ఈరోజు విడుదల అయ్యింది. గతంలో ప్రకటించిన 686 పోస్టులను ఈ నోటిఫికేషన్‌లో 720కి పెంచారు. 471 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 249 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయనున్నారు. 203 డిప్యూటీ తహసీల్దార్, 176 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులను భర్తీ చేయనున్నారు. అలాగే జీఎస్టీ ఆఫీసర్ 40, ఎక్సైజ్ ఎస్ఐ 29 పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్ కింద ఏఎస్ఓ 80, సీనియర్ అకౌంటెంట్ 91 పోస్టులను భర్తీ చేయనున్నారు. పోస్టులకు నేటి నుంచే ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు డిసెంబర్ 11 తుది గడువు కాగా.. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21న ప్రాథమిక పరీక్ష నిర్వహించనున్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులుగా ఏపీపీఎస్సీ పేర్కొంది. వయోపరిమితిని గరిష్ఠంగా 44 ఏళ్లుగా ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాల సడలింపు కూడా ఉంటుంది. ఎక్సైజ్ ఎస్ఐ పోస్టులకు వయోపరిమితి 18 నుంచి 30 ఏళ్లుగా నిర్ణయించారు.

==========

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్) ప్రాంగణంలో వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు అఖిల భారత డీజీపీ-ఐజీపీ సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా పలువురు ప్రముఖులు, దేశవ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఈ సదస్సులో యోగాకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించనున్నారు. ప్రధానమంత్రి యోగాను ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చి, నిత్యజీవితంలో భాగం చేయాలన్న ఆశయానికి అనుగుణంగా మూడు రోజుల పాటు ప్రత్యేక యోగా సాధన నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు ఉన్నతాధికారుల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెంపొందించేలా రాష్ట్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి జరుగుతున్న ఏర్పాట్లు గురించి అధికారులతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈరోజు చర్చించారు. యోగా సాధన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

==========

ప్రభుత్వ - ప్రవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేపడుతున్న రహదారుల నిర్మాణంపై ఆర్&బీ శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఈరోజు సమీక్ష నిర్వహించారు. అమరావతి సచివాలయంలోని ఆర్ & బీ కార్యాలయంలో పీపీపీ రోడ్ల అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 10 ప్రాజెక్టులు పీపీపీ విధానంలో, ఒక ప్రాజెక్టు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (HAM)లో చేపడుతున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ 10 ప్రాజెక్టుల్లో 6 ప్రాజెక్టులకు సమగ్ర నివేదికలు పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. పీపీపీ ప్రాజెక్టులకు సంబంధించి.. భూసేకరణకు అవసరమైన నిధులుపై చర్చించి, ఆయా నిధులును సమకూర్చుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

విరామం

==========

విజయనగరం జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బి. శాంతి స్పష్టం చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించి కలెక్టరేట్ ఆడిటోరియంలో ఈరోజు నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం రెండవ సెషన్‌లో ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలని శిక్షకులకు దిశా నిర్దేశం చేశారు. గత ఏడాది జిల్లాలో సుమారు 4 లక్షల 16 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ ఏడాది వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఇందులో సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

==========

గిరిజన సమాజాల గొప్ప సాంస్కృతిక వారసత్వం, పోరాట పటిమ, దేశ స్వాతంత్ర్య పోరాటంలో వారు అందించిన అమూల్యమైన సేవలను స్మరించుకుంటూ దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని విజయవాడ డివిజన్‌లో `జనజాతీయ గౌరవ్ దివస్` వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. అందులో భాగంగా విజయవాడ రైల్వే ఆడిటోరియంలో ఈరోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పి.ఈ. ఎడ్విన్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి ధైర్యసాహసాలు, దేశభక్తి, సమాజం పట్ల అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గిరిజన సమాజాల గొప్ప సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలను పరిరక్షించి, ప్రోత్సహించడంతో పాటు దేశ నిర్మాణంలో వారు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు.

==========

శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి తెప్పోత్సవాన్ని ఈ నెల 21వ తేదీ శనివారం నిర్వహించనున్నారు. ఆలయం ఎదురుగా ఉన్న ఇంద్రపుష్కరిణిలో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ వేడుకను అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. తెప్పోత్సవం సందర్భంగా స్వామి వారిని విశేషంగా అలంకరించి దేవేరులతో సహా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన హంసనావపై కొలువుదీర్చి పుష్కరిణిలో భక్తుల దర్శనార్థం ఊరేగిస్తారు. ఈ ఉత్సవ విశేషాలను ఆలయ ఉప కమిషనర్, కార్యనిర్వహణాధికారి కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తెప్పోత్సవాన్ని తిలకించాలని కోరారు.

==========

విశాఖపట్టణం వేదికగా ఈ నెల 12, 13వ తేదీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర సంబంధిత అధికారులు, సీఐఐ ప్రతినిధులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక వద్ద చేపడుతున్న మౌలిక సదుపాయాలు, అతిథులకు కల్పించాల్సిన సౌకర్యాలు, రవాణా, పార్కింగ్, భద్రత, పారిశుధ్యం తదితర ఏర్పాట్లను సమీక్షించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ.. నిర్దేశిత గడువులోగా అన్ని పనులను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు, సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ సందర్శించారు.

==========

హామిల్టన్ వేదికగా న్యూజిలాండ్ - భారత్ మధ్య జరగాల్సిన మూడో వన్డే క్రికెట్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 7 గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కావాల్సి ఉన్నా.. వర్షం అంతరాయంతో 9 గంటలకు టాస్ పడింది. అయితే, టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. కనీసం 20 ఓవర్ల ఆటైనా సాధ్యపడుతుందని భావించినప్పటికీ వర్షం తగ్గకపోవడంతో చివరికి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అంపైర్లు నిర్ణయించారు. దీంతో మొదటి రెండు మ్యాచ్ లలో విజయం సాధించిన భారత్ ఇప్పటికే 2-0 ఆధిక్యంలో కొనసాగుతోంది. మిగతా రెండింట్లో ఒక్క మ్యాచ్ గెలిచినా సిరీస్ సొంతమవుతుంది.

==========
==========